


# జీవ మృత్యు

ఇచ్ఛాపురపు రామచంద్రం

బ్రతుకు తీపి- మరణ భీతి- మనిషికే కాదు, ప్రాణులన్నిటికీ అంతే.

పుట్టుకనుంచి చావువరకూ చేసే ప్రయాణాన్ని జీవితం అని నిర్వచించుకుంటే-ఈ జీవితంలో ఎంత వైవిధ్యం! ఎంత ఆకర్షణ!

మనిషి జీవితం మరీ రంగుల మయం.

ఒకపట్టాన అర్థంకాని యీ అస్తవ్యస్తపు వర్ణచిత్రానికి మరిన్ని రంగులు పూసుకుందుకూ మరిన్ని హంగులు చేసుకుందుకూ మనిషికెన్ని తాపత్రయాలు!

మానవ జీవితాలలో ఎన్నెన్ని రంగులు! ఎన్నెన్ని హంగులు!!

చివరకు— జీవితం చివరకు— మిగిలేదేమిటి? ఏమీలేదు. గుప్పెడు బుగ్గి.

ఎంత ఘనమైన జీవితమయినా పిడికెడు బుగ్గితో అంతంకావలసిందే కద ?

*   *   *

బ్రతుకు తీపి- మహా దొడ్డది, అమిత చెడ్డది.

బ్రతుకు తీపి మనిషిచేత ఏ పనయినా చేయించగల మహత్తర శక్తివంతమయినది.

అలా ఆలకించండి. అటు పరికించండి.

డప్పులశబ్దం వినపడడంలేదూ ! వినపడకేం చేస్తుంది, వినేవాళ్ల చెవులు గింగురుమనేటట్లు- వేళ్ళు విరిగేలా వాడలా మోత మ్రోగిస్తూంటే, ఆ మునిలాడి వేళ్లలో అంత ఓపికెక్కడిదో ! ఇంతకీ ఎందుకా వాద్యసందోహం ?

మిమ్మల్నీ, నన్నూ, మరో పదిమందినీ వీలయితే యింకా ఎక్కువ మందినీ నిలబెట్టి మన దృష్టి ఆకట్టుకునేందుకు. చూడండి, అక్కడ జరుగుతున్నది- దొమ్మరాట !

ఎత్తయిన వెదురుబొంగుమీద- ప్రాణాలకు తెగించి- ఆకాశంలో పిల్లిమొగ్గలు !

సాహసంతో కూడిన సర్కస్. పడి- ప్రాణాలు తీసుకుందుకా ?

ఊహూ. కాదు. ప్రాణాలు తీసుకుందుకు కాదు, పోసుకుందుకే.

గెడచివర- ఆకసాన- చూపుకందని ఎత్తులో- పల్టీలు కొడుతున్న తల్లిని చూస్తూ- కటిక నేలమీద- కాలుతున్న ఎండలో- వేడెక్కిన అరికాళ్ళమీద నిలుచుని- వేలెడులేని ఆ పాపడు- చప్పట్లు కొడుతూ- చెమటలు కారుతున్నాడే, వీడెవడు ?

దొమ్మరిసాని కొడుకు మూడేళ్ళబుడతడు. ముక్కుపచ్చ లారనివాడు. మూట కడుతున్నాడు. ముచ్చట కొలుపుతున్నాడు. మండుటెండలో కందిపోతూ వాడెందుకూ ?

తల్లి గెడ దిగగానే- ముఖం తుడుచుకుని తాడుమీద నడకకి సిద్ధపడగానే- ఆమె వెనుక- కొంగుపట్టుకుని- తాడుమీద- తడబడే అడుగులతో- తల్లివెంట నడిచేందుకు ?

గుడ్డుతెరిచి- గడ్డు ప్రపంచంలో అడుగుపెట్టకుండానే బ్రతుకు బరువు పంచుకోవలసిన నిర్భాగ్యుడని ఆ ముద్దుబిడ్డకు తెలుసునా ! తెలియదు

ఆ సన్నని తాడుమీద అడుగు తడబడితే- లేతప్రాణం భూమిలో కలిసిపోతుందని ఆ పసివాడికి తెలుసునా ?— తెలియదు గాక తెలియదు-

మరేం తెలుసు ?

డప్పుల చప్పుడు కనుగుణంగాఅడుగు వేయాలనీ, చూపు 'అమ్మమీదే నిలపాలనీ, అంతవరకే తరిఫీదు. ఆ పై తిరకాసొస్తే ?

ఆ బుల్లి బుర్రలో అంతంత ప్రశ్న

లకు తావేలేదు. చూపు చుక్కలమీద, నడక తాడుమీద. అంతే, అంతే.

శీర్షాసనంవేసి- మొనలు పైకి పెట్టి మట్టిలో గుచ్చిన సూదులను కనురెప్పలతో తొలగించడం- దొమ్మరివాడికి వినోదమా? కాదు కాదు. ఆ ఆట-వాడు కావాలని ఆడడంలేదు. బతుకు ఆడిస్తూంది, జీవనఖేలలో వాడో పావు. ఆటవస్తువు.

ఇదంతా దేనికి?

జానెడుపొట్టకి - పిడికెడు అన్నం అందించడానికి, చారెడు గింజలు సంపాదించుకుందుకు. పన్నెండేళ్ళ కుర్రవాడి వీపుమీద ఆ తట్లేమిటి? గడ్డుబ్రతుకు తరిఫీదులో తగిలిన దెబ్బల తాలూకు గుర్తులు. ఛెళ్... ఛెళ్... ఛెళ్... కమ్చీ వీపుమీద మోగాలి. నాలుగు డబ్బులు రావాలి. బతుకుమీది ఆశ

ఆట!

రుసుము - ముందు చెల్లించనక్కరలేదు. చూసి- దయకలిగితే- మనసు కరిగితే... ధర్మం. ఓ బాబు ఐదు పైసలు... ఓ రాజు పదిపైసలు... ఓ దేముడు- పావలా.

ఇచ్చిన బాబుకి ఓ సలామ్. ఇవ్వని మారాజుకి పది సలామ్‌లు.

"పదవే, ఇంకేటి సూత్తావ్? అళ్లూ మనలాటోళ్ళే."

"మనంత యీనంకాదు. మనకంటే మెరుగే."

మొగాడికి పౌరుషం వొచ్చింది. బక్కవాడికి కోపంవెక్కువ. ఆకలికి కోపం వెక్కువే.

"నోరుముయ్యెహె... మాటలు సెబుతున్నాది, మాటలు." కసిరాడు. మొగాడు కనక కోపంవొచ్చినా, తాపంవొచ్చినా తీర్చుకుందుకు అప్పనంగా ఓ ఆడది దొరికింది. అది మొగమహారాజు తరతరాలుగా చేసుకున్న అదృష్టం. పూర్వపుణ్యం?

కాలే కడుపులతో... మండే గుండెలతో... ఎండలో స్టేషను చేరుకున్నారు.

ఓవర్ బ్రిడ్జెక్కకుండానే ఆర్.పి.యఫ్- పోలీసెదురయ్యాడు.


ఆశగా చూశారు.

"ఎళ్లండెళ్లండి. మీకు బాగా అలవాటయిపోయింది." కసిరాడు పోలీసు.

"మూడ్రోజులై గెంజినీళ్ళు నేవు. కూటికి ముకంవాసిపోయున్నాం. యింటిల్లిపాదీ ఒక్కటంటే ఒక్కటి. ఒక్క శవం దయసేయించండి. మీ మేలు జనమలో మరిసిపోం. మా సెర్మంతో సెప్పులు కుట్టిచ్చినా రుణంతీరదు-" పోలీసుని ప్రాధేయపడ్డాడు పోలీసు వినిపించుకోలేదు.

ఆడదికూడా వేడుకుంది. "ఒక్క శవం బాబూ. ఒక్క శవం... ఒక్కటంటే ఒక్కటే. దయసూడు దరమరాజూ. దిక్కులేనోళ్ళం."

వికటంగా నవ్వాడు ఆర్.పి.యఫ్.




పోలీసు. "నేనేటి జేసేది? పేపర్లో వెయిం చాలి వాంటెడ్ శవం- అని. ఎవడూ సావకపోతే నేనేంజేసేది? నన్ను పీక్కు తినకండి. పొండి నన్ను సంపకండి-"

ఆలుమగలు నీరసంగా నిట్టూర్చి వెనక్కి తిరిగారు.

"మన కదురుస్టంనేదు ఈడే పొద్దుట సంగమయ్యకి పిలిచి మరీ శవం యిచ్చా డంట."

"అది ఆడి ముకసిరి, ఆడికి దచ్చినా దక్కుతుంది, శవంవూ దక్కుతుంది. మన్ని జూసేటలి కేటొత్తదో- ఎప్పుడూ మొండిసెయ్యే. దచ్చినక్కర్లేదు, శవం యివ్వండన్నా యివ్వరు-"

ఎండ పేచ్రేగి పోతూంది

కడుపులో ఆకలి కాలిపోతూంది.

వాళ్ళ ఆశలలో శవాలు. వాళ్ళ అన్వేషణ- శవంకోసం. ఇంతకీ వాళ్ళెవరు?

అనామకులు కారు కానీ అటువంటి వారే. శవంకోసం దేవులాడుతున్నారెందు కని? నరమాంస భక్షకులా? కాదు, కాదు. మరి?

చాలామంది అసహ్యించుకునే, భయ పడే శవాలను- వీళ్ళు ప్రేమిస్తారు! ఆప్యాయంగా కౌగలించుకుంటారు. వర సలు కలుపుకుంటారు.

జీవనపథంలో ఎన్ని చిత్ర విచి త్రాలు!

ఒక్కసారి వాళ్ళ బతుకు బొమ్మని చూద్దాం. చూస్తే తరిస్తామని కాదు. తపి స్తామని!

మనలాంటి మనుషులు- మన నడుమ మనుషులు... వాళ్లూ మనషులే.

శవం దొరికితే- పండగలా ఉంటుంది వారికి. మగశవం అయితే మరీ మజాగా ఉంటుంది.

రద్దీ రోడ్డు పక్క— పేవ్‌మెంట్ మీద శవం. మగశవం, ముఖంమాత్రమే కనిపించేలా.

కుంకుమా, పూటా, తలదిక్కున అగరొత్తులు.

జుత్తు విరబోసుకుని— గుండెలు బాదుకుంటూ ఆ శవంమీద పడి ఏడిచే ఆడది.

"నన్ను నట్టేట ముంచి పోనావా! దిక్కుమాలిందాన్ని చేసేశావా! బతుకు నడిసంద్రంలో నావే బపోయింది. నిన్ను బుగ్గి సెయ్యడానికేనా డబ్బుల్లేవే, నానేటి జేసేది నాయదో?

బాబూ, కనికరించండి. దరమ రాజులూ దయసూడండి. దిక్కుమాలిన సావు... పీనుగుని బుగ్గిసెయ్యాలి. పైస వెయ్యండి పెబువులూ. వున్నెంచేసుకొండి పెద్దలూ..."

దాని నిజం మొగుడు దగ్గరలోనే ఉంటాడు. అంతా చూస్తూంటాడు. శవం మీద రాలే డబ్బుల్ని లెక్కేసుకుంటాడు. ఎక్కువ రాలుతూంటే లొట్టలేసుకుంటూంటాడు.

ఆడశవం దొరికితే మరో కథ, మరో నాటకం.

శవంపక్క మొగాడు కూర్చుంటాడు ముకం వేలేసుకుని, పుట్టెడు దుఃఖంలో మునిగినట్టు.

"నువ్వు సచ్చిపోతే ఎలాగ? ఈ బిడ్డల్ని తల్లిలేనోళ్లని జేసి— నీ దారి నువ్వు జూసేసుకుని సుకపడిపోతావా! ఏటిమధ్యలో సంసారాన్నొదిలేశావే! ఈ పిల్లల్ని ఎలా పెంచాలి? ఈ శవాన్నెలా లేపాలి? నాకు దారి కనపడ్డం లేదు. దిక్కుతోచడం లేదు.

ఏడవకండి బాబులూ. ఏడవకండి. మనంవెంతేడిసినా అమ్మ తిరిగిరాదు."

శవంపక్కన కూర్చుని మగవాడు, శవంమీదపడి పిల్లలు... అందరూ ఏడ్పులు.

మనిషన్నవాడి మనసు కరగకపోదు. ఉన్నవాడి చేతినుంచి ఒకటో అరో పైసలు రాలకపోవు. ఇంటికో యీక, యిల్లాలికో కంబళి. రాలేడబ్బులే—వాళ్ళ ఆకలి తీరుస్తాయి. అదే వాళ్ళ బ్రతుకు. శవాలే వాళ్ళ జీవనాధారం. ఈ నీచ బ్బతుకు వీళ్ళెందుకు బతుకుతున్నారు! మార్గాంతరం తోచక.

మరి— శవాలెక్కడ దొరుకుతాయి?

రైలుస్టేషన్లలో... గవర్నమెంట్ ఆస్పత్రులలో... పోలీస్‌స్టేషన్లలో...

ఎలాగ? అనాధచావులు చస్తారే... వాళ్లవే దొరుకుతాయి. అడ్రస్‌లేని శవాలను పోలీసోళ్ళే దహనం చేయించాలి. శవానికి పాతికో పరకో కర్చులకింద యిస్తుంది ప్రభుత్వం. పాతికా జేబులో వేసేసుకోరు పోలీసులు. ఐదో ఆరో రిక్షావాడికిచ్చి శవాన్ని పాతెయ్యడమో, సముద్రంలో పారెయ్యడమో చెయ్యమంటారు. ఆ రిక్షావాడు_ మన కథలోలాటి శవాధారులకి (అనవచ్చునా?)దయగానో డబ్బులుతీసుకునో యిచ్చేస్తాడు.

వాళ్లేంచేస్తారో మనం చూడనే చూశామ్. మనిషి-మనిషిమీద వ్యాపారం చేసే ప్రస్తుత వ్యవస్థలో_మనిషి- శవాల

మీద వ్యాపారం చేయడం ఏమంత అబ్బురం? విడ్డూరం?

మన కథానాయకీ నాయకుల పేర్లు రంగమ్మా, నారాయణా. వీళ్ళకి ప్రత్యర్థులూ, పోటీదార్లూ తక్కువేమీలేరు. వారిలో సంగయ్య ఒకడు. సారాపోసి శవాలను కొనగలిగే సంగమయ్య-శవా ధారులలో స్థితిమంతుడిగా జమ. పోలీసులే కానీండి, ఆసుపత్రి వార్డ్‌బోయ్‌లే కానీండి- దబ్బుకి లొంగని వారుంటే ఉడవచ్చు. శవాన్నమ్ముకోడం ఏమిటి- నీచం, అనుకోవచ్చు. కాని- సారా డబ్బుకిందకి రాదు. బహుమతి కిందకొస్తుంది. అదుకే వాళ్లంతా సంగమయ్య అందించిన సారా తీసుకుని శవాన్నిచ్చేందుకు సంకోచించరు సరికదా సంతోషిస్తారు. అతని వ్యాపారంలో యిదే కిటుకు. భారీఎత్తులో కనుక కొన్ని సులభమార్గాలూ చవకదారులూ కూడా సంగయ్యకి తెలుసు కోవెల పూజారినుంచి అగరొత్తులూ, పూలూ, పసుపూ కుంకుమా వగైరాలు చవగ్గా కొంటాడు. కనుక- శవంమీద పెట్టే పెట్టుబడి తక్కువ. రాబడి ఎక్కువ. మరి- వ్యాపారం లాభసాటిగా కాక మరెలా ఉంటుంది?

"దేసనుకి పోదారి పద. రోజు బాగుంటే దొరుకుతుంది."

కాళ్ళు మాడుతూంటే- పోలీస్టేషనుకి నడిచారు, ఆసుపత్రికి నడిచారు

రెండుచోట్లా మొండిచెయ్యి ఎదురైంది.

మజ్ఝాన్నం మూడుదాటింది. చెట్టు కిందకి చేరుకున్నారు చేయగలిగిందేమీ లేక.

చెట్టు-నీడనిస్తుంది. అకలి తీర్చదు. తీర్చలేదు.

శవం దొరకాలి. ఆకలి తీరాలి.

శవంకోసం కలవరిస్తూనే శోషవచ్చినట్లు పడుకున్నారు.

ఎండనపడి తిరిగారేమో- వొంటి మీద స్పృహే లేకపోయింది.

* * *

స్థానిక పత్రికలో బాక్సుకట్టి మరీ ప్రకటించబడిందొక వింత.

నెలకి ఐదువందలు దొరికే ఉద్యోగం చేస్తూకూడా-భార్యా పిల్లలున్న ఉద్యోగి- స్కూటరు కొనుక్కోలేక పోయినందుకు చింతిస్తూ- ఇక ఆ కోరిక తీరదని-ఆత్మహత్య చేసుకున్నాడు.

పేపరు చదివినవాళ్ళు ముక్కుమీద వేలేసుకున్నంత పనిచేశారు.

పేపరు కందని వార్త ఒకటుంది.

ఊరిచివర మర్రిచెట్టుకింద- నాలుగు శవాలున్నాయి

అవన్నీ ఆకలిచావులు.

శవం దొరక్కపోవడంతో- ఆ నలుగురూ శవాలైపోయారు.

ఇది విచిత్రమే కానీ- అట్టే మందికి తెలియదు.

అసలు- జీవితానికి మించిన విచిత్రం ఏముంది?

మనిషి-ఎంత ఎదిగినా- ఎంత ఎత్తుకి ఎగిరినా అందకుండా ఊరించేది జీవితం తప్ప మరేముంటుంది?